సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 6 । నవంబర్ । 2022

పాల కడలిలా..



వంజంగి హిల్స్‌పై మంచు అందాలు పాలకడలిని తలపించాయి. ఈ అందాలను వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు,ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు తరలివస్తున్నారు. శనివారం వేకువజాము నుంచే పర్యాటకులు వంజంగి హిల్స్‌కు కాలినడకన చేరుకున్నారు. సూర్యోదయం, మంచు అందాలను వీక్షించారు. - సాక్షి, పాడేరు



సోలార్ కంచె ఏర్పాటుతో మేలు

వ్యవసాయ వంట భూములకు సోలార్ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుని సహకారం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తరగతులు

పాడేరు రూరల్ : పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అభ్యాసకుల అధ్యయన కేంద్రం-128లో డిగ్రీ సెమిస్టర్ 1, 3, 5 విద్యార్థులకు ఆదివారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ వనుం చిట్టిబ్బాయి తెలిపారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, అకాడమి కౌన్సిలర్లు ఈ తరగతులకు విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు. వివరాలకు 94909 58695, 7382929728, 9490372020 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

15 నుంచి వెల్లూరులో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

సాక్షి,పాడేరు: తమిళనాడులోని వెల్లూరు జిల్లా క్రీడా ప్రాంగణంలో ఈ నెల 15 నుంచి 29 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెన్నై రిక్రూట్‌మెంట్ కార్యాలయ అధికారులు .ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల అభ్యర్థుల కోసం ఆర్మీ ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అగ్నివీర్ (పురుషులు, మహిళా మిలిటరీ పోలీస్), సోల్జర్ టెక్నికల్ నర్సింగ్ అసిస్టెంట్, వెటర్నరీ నర్సింగ్ అసిస్టెంట్, సైన్యంలోని జూనియర్ కమిషన్ ఆఫీసర్ ఉద్యోగాలకు www. joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు కచ్చితమైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని, ఎంపిక పారదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు.

అడ్డాకులతో వినూత్న నిరసన

- రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనుల డిమాండ్



అడ్డాకులతో నిరసన తెలుపుతున్న నాలుగు గ్రామాల గిరిజనులు

అనంతగిరి: మండలంలోని మారుమూల జీనబాడు, పెదకోట పంచాయతీల్లోని గిరి శిఖర గ్రామాలైన రాచకీలం, రెడ్డి, మద్రేబు, పాలబంద గ్రామాల గిరిజనులు శనివారం అడ్డాకులతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల వ్యవధిలో రాచకీలం, మద్రేబు గ్రామాల్లో రాజబాబు, రాములమ్మ, సాలమో, రాజులమ్మ అనే నలుగురు గిరిజనులు మృత్యువాతపడ్డారని వాపోయారు. గ్రామంలోని ఎవరైనా ఆనారోగ్యానికి గురైతే డోలీమోతపై తరలించాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు గోవింద్ పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందిస్తున్న ఈఎంటీ శ్రీను

జి.మాడుగుల: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. మండలంలో కె. కోడాపల్లి పంచాయతీ కలవపూలు గ్రామానికి చెందిన పి.రాధకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వాహనంలో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా పాడేరు దగ్గరలో ప్రసవించినట్లు ఈఎంటీ శ్రీను తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఆయన అన్నారు. వారిని పాడేరు ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

దివ్యాంగుల్లో వెల్లువెత్తిన ఆనందం



శిబిరానికి హాజరైన దివ్యాంగులు

- సదరం శిబిరానికి విశేష స్పందన
- అర్హులందరికీ ధ్రువపత్రాల మంజూరు
- వెంటనే అందజేసిన అధికారులు

చింతపల్లి: మండల కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించిన సదరం శిబిరానికి మంచి స్పందన లభించింది. చాన్నాళ్ల తరువాత ఈ శిబిరం నిర్వహించడంతో ఎంతో అర్హులు ధ్రువపత్రాలకు నోచుకున్నారు. అర్హత ఉన్నా పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వ సహాయానికి నోచుకోని దివ్యాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. దీంతో వారిలో ఆనందం వెల్లువెత్తుతోంది.

ధ్రువపత్రం లేక పింఛనుకు దూరం..

గిరిజన గ్రామాల్లో ఎంతో మంది అర్హులైన దివ్యాంగులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పరమైన గుర్తింపు పత్రాలు లేకపోవడంతో పింఛను సహాయానికి దూరమయ్యారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి, గ్రామాల్లో సందర్శించనప్పుడు ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ దృష్టికి సమస్యను దివ్యాంగులు తీసుకు వచ్చారు. దీంతో ప్రత్యేక సదరం శిబిరం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. శుక్ర, శనివారాల్లో సదరం శిబిరాలను నిర్వహించారు. శుక్రవారం 734, శనివారం 503 మందికి పరీక్షలు నిర్వహించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల నుంచి పెద్ద ఎత్తున దివ్యాంగులు తరలివచ్చారు. వీరిలో అర్హులందరికీ సదరం ధ్రువ పత్రాలు మంజూరు చేశారు.

పోలీసుల మానవత్వం

కొయ్యూరు: స్థానిక పోలీసులు మానవత్వం చాటుకున్నారు.చింతపల్లిలో నిర్వహించిన సదరం శిబిరానికి వికలాంగుల కోసం వారే నేరుగా వాహనాలు



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

సమకూర్చారు. నడవలేని స్థితిలో ఉన్నవారిని సీఐ స్వామినాయుడు ఎత్తుకుని చాలా దూరం వరకు మోసుకువచ్చి వాహనంలోకి ఎక్కించారు. మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ కూడా నడవలేని వారిని నేరుగా వాహనాల వద్దకు మోసుకుని తీసుకువచ్చారు. పోలీసులు సహకారం అందించకుంటే ప్రభుత్వం ఏర్పాటుచేసిన సదరం శిబిరానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారమని పలువురు దివ్యాంగులు పేర్కొన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. తోడు ట్రస్ట్‌కు చెందిన మురళి అనే వ్యక్తి కూడా సహకారం అందించారు.

వెంటనే ధ్రువపత్రం మంజూరు



ధ్రువపత్రం కోసం ఎన్నో ఏళ్లుగా తిరుగుతున్నా మంజూరు కాలేదు. ఇక్కడ సదరం శిబిరం నిర్వహిస్తున్నారని తెలిసి వచ్చా. వెంటనే అర్హత పత్రం మంజూరు చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం చాలా మంచిది.

– అర్జున్, మఠంభీమవరం, కొయ్యూరు మండలం

శిబిరంతో సమస్య పరిష్కారం

చింతపల్లి/చింతపల్లి రూరల్: సదరం ధ్రువపత్రం లేక దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించామని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో శనివారం రెండవ రోజు నిర్వహించిన మెగా సదరం శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు ధ్రువపత్రాలు లేకపోవడం వల్ల ఎన్నో ఏళ్లుగా పింఛన్లకు నోచుకోవడం లేదన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో జారీ చేసిన ధ్రువపత్రాలు వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. పలువురు దివ్యాంగులకు ఆమె ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. సికెల్‌సెల్ ఎనీమియాకు సంబంధించిన రోగులను గుర్తించేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొన్నారు. అర్హులైన బాధితులను గుర్తించి ప్రభుత్వ సహాయం అందజేస్తామని ఆమె తెలిపారు. శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్యాధికారులు, పోలీసులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆమె సత్కరించారు. సబ్‌కలెక్టర్ అభిషేక్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు నరసింగరావు, డీపీవో కుమార్, ఎంపీపీ అనూషా దేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



నడవలేని వ్యక్తిని ఎత్తుకొని తీసుకువస్తున్న సీఐ స్వామినాయుడు



దివ్యాంగుడిని తీసుకువస్తున్న ఎస్‌ఐ లోకేష్‌కుమార్

అవస్థలు తప్పాయి



వికలాంగ ధ్రువపత్రం కోసం ఎన్నో ఏళ్లుగా తిరుగుతున్నాను. ప్రత్యేక శిబిరం నిర్వహించడం వల్ల తనకు గుర్తింపు పత్రం లభించింది. ప్రభుత్వం ప్రత్యేకంగా శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉంది.

– కిముడు రాజులమ్మ, శరభన్నపాలెం, కొయ్యూరు మండలం

సదరం శిబిరంతో మేలు



సదరం శిబిరం రెండు రోజుల పాటు నిర్వహించడం దివ్యాంగుల అదృష్టంగా భావించాలి. ధ్రువపత్రాల కోసం దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడేవారు. శిబిరం ఏర్పాటు చేయడం వల్ల వారికి మంచి మేలు జరిగింది.

– తేజేశ్వరరావు, న్యూరాలజిస్ట్, కేజీహెచ్, విశాఖపట్నం

ట్రైసైకిల్ వాహన దరఖాస్తు స్వీకరణకు గడువు పెంపు

సాక్షి,పాడేరు: విభిన్న ప్రతిభావంతులు (శారీరక **అంగ వైకల్యం)** ప్రభుత్వం ఉచితంగా అందజేసే **మూడు చక్రాల వాహ**నాలు పొందేందుకు ఈ నెల **15 వరకు దరఖాస్తుల** స్వీకరణ గడువు పెంచినట్లు **విభిన్న ప్రతిభావంతు**లు, వయోవృద్ధుల సహాయ **సంస్థ ఏడీ సీహెచ్ సుబ్బి**రెడ్డి తెలిపారు. 18 నుంచి **45 సంవత్సరాలలో**పు వయసు కలిగినవారు, **కుటుంబ వార్షిక ఆ**దాయం రూ.3 లక్షల లోపు **ఉండి, 70 శాతం వి**కలాంగత్వం ఉన్న అభ్యర్థులు **మాత్రమే దరఖాస్తు** చేసుకోవలని ఆయన సూచించారు. **ఆలాగే అభ్యర్థు**లు కనీసం 10వ తరగతి **చదివి ఉండాలని,** విద్యార్థులైతే ఆయా కళాశాల **అధికారి నుంచి బోన**ఫైడ్ ధ్రువపత్రం తీసుకుని **ఆన్‌లైన్‌లో అప్‌లోడ్** చేయాలని సూచించారు. **ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు** కుల ధ్రువీకరణ పత్రాన్ని **దరఖాస్తుతో పాటు జ**త చేయాలని సూచించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని శారీరక దివ్యాంగ అభ్యర్థులు WWW.apdascac.ap. gov.inల వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి వాటి కాపీలను సహాయ సంచాలకులు,జిల్లా మేనేజర్, విభిన్న ప్రతిభావంతులు, మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ కార్యాలయం, రాణి చంద్రమణి దేవి ఆస్పత్రి ప్రాంగణం, పెదవాల్తేరు జంక్షన్, విశాఖపట్నం వారికి అందజేయాలని ఆయన కోరారు. వివరాలకు 0891-2952585 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కేజీబీవీల్లో సీఆర్టీ పీజీటీ పోస్టుల భర్తీకి చర్యలు

- 11 వరకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, పాడేరు: జిల్లాలోని పలు కేజీబీవీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, పీజీటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఈవో డాక్టర్ రమేష్ తెలిపారు. సీఆర్టీలకు సంబంధించి ఇంగ్లీషు, గణితం పోస్టులు, పీజీటీకి సంబంధించి తెలుగు, ఇంగ్లీషు, గణితం, బోటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ,కామర్స్ హిస్టరి, సివిక్స్, జీఎఫ్‌సీ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. నోటిఫికేషన్, దరఖాస్తులు, నియమావళి వివరాలకు పాడేరులోని డీఈవో కార్యాలయాన్ని సందర్శించాలని ఆయన కోరారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలవలకు దరఖాస్తులను జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయం, సమగ్ర శిక్ష, పాడేరులోని జిల్లా కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఐసీడీఎస్ అధికారులకు ఆదేశం

సాక్షి, పాడేరు: పాడేరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారితో సమావేశం నిర్వహించారు. కేంద్రాల పనితీరు, మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలు, పౌష్టికాహారం పంపిణీపై ఆయన సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ ప్లస్ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారులకు పాలు, కోడి గుడ్లు పంపిణీ చేయాలని ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వంట నూనె సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆయిల్ పంపిణీలో డీలర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ఇబ్బందికరంగా మారిందని సీడీపీవోలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎలాంటి సమస్య ఉన్నా ఇక నుంచి తహసీల్దార్, పాడేరు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. సీడీపీవోలంతా క్లస్టర్ స్థాయిలో సమావేశం నిర్వహించి, అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. సక్రమంగా విధులు నిర్వహించని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సేవల్లో మహిళా పోలీసులు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు పనులకు ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని కలెక్టర్ తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 50 గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. చింతూరు మండలంలో 10, జి.మాడుగుల మండలంలో 7, జి.కె.వీధిలో 5, అడ్డతీగల, పాడేరు మండలాల్లో 4 చొప్పున కొయ్యూరు, మారేడుమిల్లి, వీఆర్‌పురం, వై.రామవరం మండలాల్లో మూడేసి చొప్పున, చింతపల్లి, రాజవొమ్మంగి మండలాల్లో రెండేసి చొప్పున హుకుంపేట,డుంబ్రిగుడ, కూనవరం,రంపచోడవరం మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా మండలాల ఎంపీడీవోలు ఈ నెల 7వ తేదీన నోటిఫికేషన్ జారీచేస్తారని, 8 నుంచి ఈ నెల10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. 11వ తేదీన దరఖాస్తులు పరిశీలించి, 14వ తేదీన సెలక్షన్ కమిటీ అభ్యర్థులకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 15వ తేదీన సమాచారం ఇచ్చి 16వ తేదీన ఒక రోజు శిక్షణ అనంతరం 17వతేదీన నియామక ఉత్తర్వులు జారీచేస్తామని ఆయన తెలిపారు.

చెరువులవేనం అభివృద్ధికి ప్రాధాన్యం



చెరువులవేనంలో పర్యటించిన పీవో గోపాలకృష్ణ

చింతపల్లిరూరల్: ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగికి సమీపంలోని చెరువులవేనం అభివృద్ధికి రూ.80 లక్షలు కేటాయించామని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. శనివారం ఆయన చెరువువేనంలో పర్యటించారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న చెరువులవేనంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.80 లక్షలు మంజూరు చేశామని ఆయన పేర్కొన్నారు. 7.5 మీటర్ల వెడల్పుతో రహదారి విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. రహదారికి ఇరువైపులా వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 11,522 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. గిరిజన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరామని ఆయన తెలిపారు. ప్రస్తుతం రూ.2.15 లక్షలు కేటాయిస్తున్నారని, ఈ మొత్తాన్ని రూ.4 లక్షలకు పెంచాలని ప్రభుత్వానికి నివేదించామని పీవో తెలిపారు. హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి చర్యలు

దేవీపట్నం: గండిపోశమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ శనివారం సందర్శించారు. వరద ముంపునకు గురవుతున్న నేపథ్యంలో నూతన ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆలయ ఈవో లక్ష్మీకుమార్ తదితరులు ఉన్నారు.



గండి పోశమ్మ ఆలయాన్ని సందర్శిస్తున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్

మెరుగైన సేవలందించాలి



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

- రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్
- ఏరియా ఆస్పత్రి సందర్శన

రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సబ్ కలెక్టర్ శుభం బన్సల్ వైద్యాధికారులను ఆదేశించారు. ఏరియా ఆస్పత్రిని శనివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఆస్పత్రికి వచ్చిన రోగులకు జ్వరం, డెంగీ లక్షణాలు ఉంటే రక్తపరీక్షలు చేయాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతీ రోజు ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు, ప్రసవాల సంఖ్యను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి కల్పన, వైద్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రవీర్ వర్మ

మారేడుమిల్లి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రంపచోడవరం మేజిస్ట్రేట్ ప్రవీర్ వర్మ అన్నారు. మారేడుమిల్లి ప్రధాన సెంటర్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయం సహాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చుక్కా సంతోష్‌కుమార్, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం

డుంబ్రిగుడ: ఉపాధి పనులకు కనీస వేతనాలు చెల్లించాలే చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ రమేష్‌రామన్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన సోషల్ ఆడిట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఉందన్నారు. పనుల కల్పన, వేతనాల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఉపాధి హామీలో సచివాయ భవనాల నిర్మాణానికి జిల్లా వ్యాప్తంగా రూ.125 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పీఆర్ శాఖ నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాక పనులు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. ఏపీడీ పవన్‌కుమార్, సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పీ రామచంద్రరావు, ఎంపీడీవో నగేష్, ఏపీవో దొరబాబు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ రమేష్‌రామన్

చీడపీడల నివారణతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న జిల్లా ఉద్యాన వన శాఖాధికారి రమేష్

అరకులోయ రూరల్: ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పంట నష్టాన్ని నివారించుకోవచ్చని, అధిక దిగబడులు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి రమేష్ అన్నారు. చినలబుడు పంచాయతీ మంజగుడ గ్రామంలో శుక్రవారం తోటబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్యాబేజీ, క్యాలీఫ్లవర్ తదితర పంటలకు చీడపీడీల బెడద లేకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట మొదటిదశలోనే వేప నూనె తగినంత నీరు కలిపి పంటపై పిచికారీ చేయడంతో చీడపురుగుల ప్రభావం తగ్గుతుందన్నారు. అధికారుల సూచనలు, సలహాలు పాటించడంతో పంటల మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. ఉద్యానవన శాఖాధికారి పి.పద్మ, వీహెచ్ఏలు దశరథ్, రమేష్, జీనబందు, రైతులు తదితరులున్నారు.

సోలార్ కంచె ఏర్పాటుతో మేలు

కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అరకు ఎమ్మెల్యే పాల్గుణ వినతి

సాక్షి, పాడేరు: వ్యవసాయ పంట భూములకు సోలార్ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుని రైతులకు సహకారం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీలో ఏడాదికి మూడు పంటలు పండే విధంగా అనుకూలమైన వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు.

ఇప్పుడు ఒక పంట మాత్రమే వేస్తున్నారని, వీటికి సోలార్ కంచెలు ఏర్పాటుచేస్తే మూడు పంటలు పండించే అవకాశం ఉంటుందన్నారు. కాఫీ తోటలకు కూడా సోలార్ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుబజార్ల అభివృద్ధిపై దృష్టిసారించాలని, పీవీటీజీలకు సీసీడీపీ నిధులు మంజూరుకు కృషిచేయాలని ఎమ్మెల్యే కోరారు. పీవీటీజీలకు అంత్యోదయ కార్డులు మంజూరుచేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. అరకు నియోజకవర్గానికి సీఎం అభివృద్ధి నిధులు రూ.30 కోట్లు మంజూరయ్యాయని, మండలానికి రూ.5 కోట్లతో ప్రధాన సమస్యలు పరిష్కారానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో చర్చించి, ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొయ్యూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారక్ డి.నాని, అర్చకులు కృష్ణశర్మ అన్నారు. రాజేంద్రపాలెం రామాలయంలో శనివారం కార్తీక ద్వాదశీ పర్వదినం సందర్భంగా మనగుడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. వారు మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా నాని మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ వరకు మనగుడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొయ్యూరులో వెలసిన భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయం, రాజేంద్రపాలెం రామాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈనెల 7న కార్తీక పౌర్ణమి సందర్భంగా మల్లికార్జున ఆలయంతో పాటు రాజేంద్రపాలెం రామాలయంలో నిర్వహించే సహస్ర దీపాలంకరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొవాలని ఆయన కోరారు.

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి



మాట్లాడుతున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

పాడేరు రూరల్ : అవినీతి రహిత సమాజ స్థాపనకు విద్యార్థులు కృషి చేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినర్ హాల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శనివారం అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ యొక్క లక్ష్యాలు, చేపడుతున్న కార్యకలాపాలను విద్యార్థులకు వివరించారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ పి.సత్యపద్మ, అక్యుపెన్సీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.ఎన్. రసూల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-అర్డినేటర్ జి. గౌరీశంకర్‌రావు, విజిలెన్స్ ఎస్ఐ రవి కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

400 కేజీల జీడిపప్పు చోరీ

రావికమతం : గుడ్డిప గ్రామంలోని ఇండియన్ ఫుడ్స్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. 400 కేజీల జీడిపప్పును దొంగలు ఎత్తుకు పోయారని ఆ కంపెనీ మేనేజరు అజయ్‌కుమార్, రాధామణి శనివారం రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 170 మంది స్త్రీలు, 10 మంది పురుషులు పనిచేస్తున్న ఆ కంపెనీలో శుక్రవారం సాయంత్రం అంతా పనులు ముగించుకుని వెళ్లగా శుక్రవారం రాత్రి దొంగలు కిటికీ ఊచలు కత్తిరించి 400 కేజీల జీడిపప్పును దొంగలించుకు పోయారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు. అనకాపల్లి నేర విభాగం క్లూస్‌టీం సిబ్బంది శనివారం వచ్చి ఆధారాల కోసం పరిశీలించారు. సిబ్బందిని విచారణ చేశారు.

యువకుని అనుమానాస్పద మృతిపై క్రైమ్ ఏఎస్పీ విచారణ

మునగపాక : మండలంలోని నాగులాపల్లికి చెందిన యువకుడు యల్లపు గంగమహలక్ష్మినాయుడు అనుమానాస్పద మృతి కేసు విచారణలో భాగంగా శనివారం క్రైమ్ అడిషనల్ ఎస్పీ బి.లక్ష్మీనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గత నెల 12న ఇంటి నుంచి బయలుదేరిన గంగమహలక్ష్మినాయుడు అదే నెల 14న అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు. ఇంతవరకు ఎటువంటి అచూకీ లభించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఎస్పీ లక్ష్మీనారాయణ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కేసు విషయమై పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్ఐ చల్లా భీమరాజు ఉన్నారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

నక్కపల్లి : జాతీయ రహదారిపై నక్కపల్లి జంక్షన్‌లో శనివారం సాయంత్రం లారీ ఢీకొనడంతో మహిళ దుర్మరణం పాలయింది. వివరాలివి. ఎస్‌రాయవరం మండలం కొరుప్రోలు గ్రామానికి చెందిన కొంగర సూర్య చంద్ర మనోరాజ్యలక్ష్మి(35) తన అక్కకూతురు శరణ్యతో కలసి మోటారు సైకిల్‌పై తుని వెళ్లింది. తిరుగుప్రయాణంలో వీరు నక్కపల్లి రాగానే వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ రాజ్యలక్ష్మి పైనుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. బైక్ నడుపుతున్న శరణ్య ప్రాణాలతో బయటపడింది. రాజ్యలక్ష్మి అంధురాలు ఈమె భర్త రెండేళ్ల క్రితం మరణించినట్టు తెలిసింది. తొమ్మిదేళ్ల కుమార్తె ఉంది. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శిరీష తెలిపారు.

■ అందరికీ నచ్చిన "జీరో టు హీరో" వన్‌స్టార్ ప్యాకేజీని కొన్నవారికి పద్ధతి ప్రకారం ఐచ్చే - వచ్చే ఆదాయం నచ్చకపోతే కొన్న పెట్టుబడిని తిరిగి పొందే సదుపాయం కావాలంటే మీపేరు, మీఊరు వాట్సాప్ చేయండి : 6300172408 [V- 1596]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.